

బల్దియా జాగా కబ్జా



- జిల్లా కేంద్రంలో మున్సిపల్ భూమి అన్యాక్రాంతం
- వందకు పైగా షెడ్లు వేసి వ్యాపార సముదాయాల నిర్వహణ
- పట్టించుకోని అధికారులు, పాలక వర్గాలు

జగిత్యాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో రోడ్లను ఆనుకొని ఉన్న మున్సిపల్, సర్కారు భూములు కబ్జాకు గురవుతున్నాయి. మొదట్లో చిరు వ్యాపారాల ముసుగులో పాగా వేసిన కొందరు, క్రమంగా వాటిని తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఏకంగా షెడ్ల నిర్మాణం చేపట్టి కొందరు సొంత వ్యాపారం చేసుకుంటుండగా, మరికొందరు అద్దెకుఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రతినెల షాప్ విస్తీర్ణం బట్టి రూ.5 వేల నుంచి రూ.20వేల వరకు అద్దెవసూలు చేస్తూ మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఆక్రమణదారులకు రాజకీయ నాయకుల అండదండలు ఉండడంతో అధికారులు సైతం ఒత్తిళ్లకు తలొగ్గి ఆక్రమణల జోలికి వెళ్లడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్, ప్రభుత్వ స్థలాల్లో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఆయా ప్రభుత్వశాఖలకు భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

● గొల్లపల్లి రోడ్డులో అక్రమంగా వ్యాపార సముదాయాలు

జగిత్యాల పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి గొల్లపల్లి రోడ్డులో ఎడమవైపు రోడ్డుపక్కన ఉన్న షెడ్లన్నీ అక్రమంగా చేపట్టిన నిర్మాణలేనన్న ఆరోపణలున్నాయి. వీటి ద్వారా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మరోవైపు ఇక్కడ తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసుకున్న

జగిత్యాల జిల్లా కేంద్రంలోని గొల్లపల్లి రోడ్డులో ప్రభుత్వ స్థలాల్లో వెలసిన దుకాణాలు

● మున్సిపల్ పార్క్‌స్థలం సైతం కబ్జా..

జగిత్యాలలోని కొత్త బస్టాండ్ ఇన్‌గేట్‌కు ఎదురుగా ఉన్న మున్సిపల్ పార్క్ స్థలం సైతం కబ్జా కోరల్లో చిక్కుకుంది. ఇక్కడ ఉన్న మున్సిపల్ భూమిలో కొందరు వ్యక్తులు 20 వరకు షెడ్లు వేసి వారి ఆధీనంలో ఉంచుకున్నారు. జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత భూముల విలువ పెరగడంతో పాటు, బస్టాండ్‌కు సమీపంగా ఉండడం, వ్యాపారానికి అడ్డా కావడంతో కబ్జాదారులు ఆక్రమించుకున్న దుకాణాలను అద్దెకు ఇస్తూ వేల రూపాయల వసూలు చేసుకుంటున్నారు. ఒక సాధారణ వ్యక్తి విద్యుత్ మీటర్ కోసం దరఖాస్తు చేసుకుంటే ధ్రువపత్రాల లేకుటే మీటర్లు ఇవ్వని విద్యుత్ అధికారులు ఆక్రమించిన షెడ్లు, టేలలకు ఏ విధంగా అనుమతి ఇచ్చారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ షాపులు ఏర్పాటు చేసుకున్న కొందరు వ్యక్తులకు రాజకీయ నాయకుల అండదండలు ఉండడంతోనే అధికారులు ఆ భూముల జోలికి వెళ్లడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



బస్టాండు సమీపంలో ప్రభుత్వ స్థలాల్లో గల దుకాణాలు

కొందరు అక్కడి నుంచి కదలడం లేదు. టీస్టాల్స్ పండ్ల దుకాణదారులు, కేఫ్‌లు నిర్వహిస్తున్న వారు ఇలా చాలా మంది చిరు వ్యాపా రులు ఆక్రమణదారులకు ప్రతినెల అద్దె చెల్లిస్తున్నట్లు సమాచారం. నిత్యం రాకపోకలతో రద్దీగా ఉండడం, హాస్పిటల్ జోన్ కారణంగా అక్ర మంగా వెలిసిన దుకాణాలతో రోడ్డు మరింత ఇరుకుగా మారి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆక్రమణకు గురైన దుకాణాలు ఖాళీ చేయించడంతో పాటు మరో చోట స్ట్రీట్ వెండర్స్ కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

● కమర్షియల్ కాంపెక్స్‌లు నిర్మిస్తే భారీగా ఆదాయం

జిల్లా కేంద్రంలో మున్సిపల్ భూములతో పాటు, ఖాళీగా ఉన్న ఆర్టీసీ, ఇతర రెవెన్యూ భూములను గుర్తించి ...

మిగతా 8లో

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● జిల్లా అటవీ శాఖ అధికారి రవిప్రసాద్



జగిత్యాలలో మొక్కలు నాటుతున్న అటవీ శాఖ అధికారి రవిప్రసాద్

జగిత్యాల క్రైం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా అటవీ శాఖ అధికారి రవి ప్రసాద్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో అటవీ శాఖ అధ్వర్యంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతీ ఒక్కరూ విధిగా ఐదు మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వోలు పద్మారావు, దేవదాసు తదితరులు ఉన్నారు.

గోదావరి నదికి సప్త హారతులు



గోదావరి నదికి హారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి గోదావరి నది వద్ద గురువారం రాత్రి వేదపండితులు సప్తహారతి పూజలు నిర్వహించారు. గంగా నవరాత్రుల్లో అంతర్భాగంగా జేష్ఠ శుద్ధ ప్రతిపద నుంచి గంగా నవరాత్రోత్సవాలు ప్రారంభం అయ్యాయి. లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం నుంచి మేళా తాళాలతో ఆలయ వేదపండితులు గోదావరి నదికి వెళ్లి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి సప్త హారతులిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ పాల్గొన్నారు.

బడి బాటకు వేళాయె..

- నేటి నుండి బడి బాట
- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచడమే లక్ష్యం

వెల్గటూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. శుక్రవారం నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట నిర్వహణకు జిల్లా విద్యాధికారి రాము ఆదేశాలు జారీ చేశారు. మూత బడిన పాఠశాలలను తిరిగి తెరిచేలా చర్యలు చేపట్టాలని ఎంఈవోలకు సూచించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆయాగ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ పిల్లలను సర్కారు బడిలో చేర్పించాలని ప్రచారం నిర్వహించనున్నారు.

●ప్రవేశాల పెంపునకు చర్యలు

ప్రతీ ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో తక్కువ సంఖ్యలో ప్రవేశాలు జరగడంపై సమీక్షించిన విద్యాశాఖ అధికారులు ఈసారి మరింత పకడ్బందీగా బడిబాట నిర్వహించేలా సన్నద్ధమయ్యారు. గత ఏడాది జిల్లాలోని 820 పాఠశాలల్లో 58,676వేల మంది విద్యార్థులు విద్యనభ్యసించారు. మూడు సంవత్సరాలుగా సర్కారు బడుల్లో విద్యార్థులసంఖ్య తగ్గుతున్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. దీనితో జిల్లా విద్యాధికారి రాము ఆదేశాలమేరకు పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు వేసవి సెలవులలో కూడా ప్రచారం నిర్వహించారు.



బడి బాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు(ఫైల్)

● బడి బాట షెడ్యూల్

ఈ నెల 6 నుంచి 19 వరకు బడి బాట నిర్వహించేలా అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. ఈనెల 6న గ్రామసభలు నిర్వహిస్తారు. 7న ఇంటింటికీ వెళ్లి బడిఈడు పిల్లలను గుర్తించడం, 8నుంచి 10వతేదీ వరకు కరపత్రాలతో ప్రచారం నిర్వస్తారు. ఆయా కార్యక్రమాలపై 11 సమీక్ష నిర్వహి స్తారు. 12న అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలలను పునః ప్రారంభిస్తారు. అదే రోజు నోట్ బుక్‌లు, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ అందిస్తారు. 13న సామూహిక అక్షరా భ్యాసం, బాల ల సభ నిర్వహిస్తారు. 16న ఫౌండేషనల్ లిటరసీ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్), లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (ఎల్‌ఐపి) దినోత్సవం, 17న విలీన విద్య, బాలికా విద్య దినోత్సవం, 18న తరగతి పాఠశాలల డిజిటలీకరణపై, మొక్కల పెంపకం ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. 19న విద్యార్థులకు క్రీడాపోటీలను నిర్వహిస్తారు.

పకడ్బందీగా బడి బాట

-ఎంఈవో ప్రభాకర్



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా ఈనెల 6నుంచి పకడ్బందీగా బడిబాట నిర్వహించనున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య, ఇతర సౌకర్యాలు, పదో తరగతి ఫలితాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తాం. గతంలో కంటే ఈ ఏడాది విద్యార్థుల ప్రవేశాలు పెరగడమే లక్ష్యంగా కృషి చేస్తాం.

పంట మార్పిడితో అధిక దిగుబడులు

● ఏడీఆర్ డాక్టర్ శ్రీలత

కొడిమ్యాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రైతులు పంట మార్పిడి చేసి సాగు చేసుకున్నట్లయితే అధిక దిగుబడులను పొందవచ్చునని జగిత్యాల వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ శ్రీలత అన్నారు. గురువారం కొడిమ్యాల మండలంలోని చెప్యాల గ్రామంలో జగిత్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖతో కలిసి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి హాజరైన ఏడీఆర్ మాట్లాడుతూ సాగు నీటి యాజమాన్యం, చెట్లను పెంచడం, పర్యావరణం కాపాడటం అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. యూరియా ఇతర ఎరువులు వాడకం, రసీదు తీసుకోవటం, తెగుళ్ళు పురుగు మందుల వాడకం, విత్తన శుద్ధి చేసుకోవటం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన మేరకు యూరియాను వినియోగించాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను పట్టించుకోనట్లయితే పురుగులు, తెగుళ్ల ఉధృతి పెరగటంతో పాటుగా వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. తద్వారా పెట్టుబడులు పెరుగుతాయన్నారు. మండల వ్యవసాయ అధికారి పర్లపెల్లి జ్యోతి మాట్లాడుతూ వరి, మొక్కజొన్న పంటలనె కాకుండా ఫాం ఆయిల్ పంటలను వేసుకొన్నట్లయితే అధిక ఆదాయం పొందటానికి అవకాశం ఉందన్నారు. వివిధ పంట యాజమాన్యం, ప్రభుత్వం పథకాలు, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రీపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ఉసిరి చెట్లను నాటారు. ఈ కార్యక్రమంలో ఎడిబుల్ ఆయిల్ కంపెనీ ప్రతినిధి ఎం.అనిల్, ఏఈవో శ్రీలత, రీసెర్చ్ అసోసియేట్ వేణు, గ్రామ రైతులు దేవేందర్‌రెడ్డి, లచ్చిరెడ్డి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ శ్రీలత

పత్రికా ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా యొక్క క్లయింటు కస్తూరి విజయలక్ష్మి భర్త : రాజేందర్, నివాసం: రాయికల్, గ్రామం & మండలం గారు ఆమె యొక్క వారసత్వం క్రింద సంక్రమించిన ఉమ్మడి కుటుంబనకు చెందిన భూములు సర్వే నెం. 755లో ఏ 1-28 గుం. 756లో 0-10 గుం. 789 లో 0-23 గుం. మరియు ఇల్లు నం. 26-2, 3-91 మరియు 16-15, (10-19పాతది) & 16-17 రాయికల్ గ్రామ శివారులలో గల వాటిపై తన యొక్క వాటా కొరకు గుట్ట యెతిరాజం, గుట్ట మహేష్, గుట్ట మధుసూధన్ మరియు గుట్ట లక్ష్మీనారాయణ గార్లపై గౌరవనీయ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జీ కోర్టు నందు O.S.No. 35/2021 ద్వారా కేసు వేసినారు. ప్రస్తుతం ఇట్టి కేసు కోర్టులో పెండింగులో కలదు.

ఇట్టి పై విషయాలు కప్పిపుచ్చుతూ గుట్ట యెతిరాజం, గుట్ట మహేష్, గుట్ట మధుసూధన్ మరియు గుట్ట లక్ష్మీనారాయణ గార్లు ఇతర వ్యక్తులకు నా యొక్క క్లయింటుకు చెందిన వాటా భూములను పంపకం జరకుండా కోర్టులో కేసు పెండింగులో ఉండగా అక్రమంగా అమ్ముటకు ప్రయత్నించుచున్నట్టుగా తెలిసినది. కావున పై భూమిపై పై వ్యక్తులతో ఎవ్వరు ఎలాంటి లావాదేవీలు చేయకూడదని ఒకవేళ చేసిన వారికి చట్టప్రకారంగా ఎలాంటి హక్కులు సంక్రమించవని మరియు నా యొక్క క్లయింటు తీసుకోనబడబోయే అన్ని చర్యలకు బాధ్యులు కాగలరని ఇందుమూలముగా తెలియపరచనైనది.

సం/- కె. నర్సయ్య, అడ్వకేట్
జగిత్యాల.

కోరుట్ల మున్సిపాలిటీకి అవార్డు

● మంత్రి సురేఖ చేతుల మీదుగా అందుకున్న కమిషనర్



అవార్డును అందుకుంటున్న కమిషనర్ మారుతి ప్రసాద్

కోరుట్ల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకటించిన ఉత్తమ పర్యావరణ పని తీరు అవార్డుకు కోరుట్ల మున్సిపాలిటీ ఎంపికైంది. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో కోరుట్ల బల్దియా కమిషనర్ మారుతి ప్రసాద్, మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా అవార్డును అందుకున్నాడు. తడి, పొడి, చెత్త సేకరణలో ఇంటింటి వెహికిల్ ట్రాకింగ్, ఎరువు తయారీ, బీఆర్‌సీసీ కేంద్రంలో చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేయడంలో కోరుట్ల మున్సిపాలిటీ గుర్తింపు పొంది అవార్డుకు ఎంపికైంది. అవార్డు ఎంపికకు కృషి చేసిన కోరుట్ల పట్టణ ప్రజలకు మున్సిపల్ కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాలరూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని తిమ్మాపూర్ శివారులోగల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి గాను అర్హత కలిగిన విద్యార్థుల నుంచి అడ్మిషన్ల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ గునుక శ్రీలత తెలిపారు. ఎంపీసీ, ఏమెస్సీసీఎస్, బీజెడ్సీ, ఫుడ్ సైన్స్, బీకాం కంప్యూటర్, బీఏ కోర్సులకు ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. డిగ్రీలో అడ్మిషన్ కోసం ఇంటర్మీడియట్ పాసై ఉండాలన్నారు. తల్లితండ్రుల వార్షిక ఆదాయం పట్టణంలో 2 లక్షలలోపు, గ్రామాల్లో లక్ష 50లోపు ఉండాలని అన్నారు. దరఖాస్తుతో పాటుగా పదోతరగతి మెమో, ఇంటర్మీడియట్ మెమో, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో కళాశాలలో సంప్రదించాలన్నారు.

పెళ్లి బృందం వాహనాన్ని ఢీకొట్టిన డీసీఎం వ్యాన్

- నాలుగు నెలల బాబు దుర్మరణం
- పెళ్లి కొడుకుతో పాటు ఆరుగురికి గాయాలు
- ప్రమాదంతో నిలిచిన వివాహం

6

వేంకటేశ్వరస్వామి కల్యాణం

మెట్‌పల్లిటౌన్, జూన్5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. అర్చకులు వేద మంత్రోత్సవాల మధ్య శ్రీ భూనీలా సమేత, శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు-సరోజనమ్మ దంపతులు హజరై ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణన్ని తిలకించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు మహాజన్ నర్సింల్, మహాజన్ శివకుమార్ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు

'భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం'

సారంగాపూర్, జూన్5 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి చట్టం ద్వారా ప్రజల భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలన్నదే లక్ష్యమని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. సారంగాపూర్ మండలంలోని రంగపేట గ్రామంలో జరుగుతున్న భూ భారతి రెవెన్యూ సదస్సును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు భూ భారతి చట్టాన్ని రూపొందించడం జరిగిందని తెలిపారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసుధన్, తహసీల్దార్ వహీద్దీన్, ఆర్ఐ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

● **బీర్‌పూర్:** భూ భారతి రెవెన్యూ సదస్సులో గ్రామాల వారీగా రైతులు అందిస్తున్న ప్రతి దరఖాస్తును పరిశీలించి పరిష్కారం చూపాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. గురువారం బీర్‌పూర్ మండలంలో పర్యటించిన కలెక్టర్ నర్సింహులపల్లి గ్రామంలో జరుగుతున్న భూ భారతి రెవెన్యూ సదస్సును ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సదస్సు వద్ద ఉన్న రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భూ భారతి రెవెన్యూ సదస్సులు 20 వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సదస్సులలో అధికారులు గ్రామాల వారీగా సందర్శించి, రైతుల భూ సమస్యలపై దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు. కార్యక్రమంలో జగిత్యా రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసుదన్, బీర్‌పూర్ తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో లచ్చాలు, డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాస్ ఉన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్

పకడ్బందీగా వార్డుల విభజన నిర్వహించాలి



కలెక్టరేట్ ఏవో హకీంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జగిత్యాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్‌లో నిర్వహించనున్న వార్డుల విభజన పకడ్బందీగా చేయాలని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఏవో హకీంకు బీసీ సంక్షేమ సంఘం నేతలు వినతిపత్రం అందించారు. గురువారం పట్టణంలోని కలెక్టరేట్ కార్యాల యంలో ఏఓ హకీంను కలిసి వినతిపత్రం అందించిన అనంతరం పలువురు నేతలు మాట్లాడారు. మున్సిపల్ పట్టణాన్ని 50 వార్డులకు పెంచుతూ విభజన చేయడాన్ని స్వాగతి స్తున్నామన్నారు. ఆయా వార్డులలో మృతి చెందిన వ్యక్తులను, స్థానికంగా లేని వారిని, రెండు చోట్ల ఓట్లు ఉన్న వారిని క్షేత్ర స్థాయిలో అధికారులతో సర్వే చేపించి ఓటరు లిస్టులను తయారు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల నారాయణ, నాయకులు కొక్కు గంగాధర్, రాచకొండ రోజ, దండుగుల వంశీ, హృషికేష్, మల్లయ్య పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉప వైద్యాధికారి డా. శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం జగిత్యాల కొత్తబస్టాండ్ ప్రాంతంలో కార్మికుల అడ్డాలో సమీ కృత ఆరోగ్య శిబిరంను నిర్వహించారు. ఈ సంద ర్భంగా పలువురికి హెచ్.ఐ.వి, టీబీ, మధు మేహం, రక్తపోటు పరీక్షలను నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులు తరచుగా ఆరోగ్య పరిక్షలను తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మంకిడి శ్రీనివాస్, ఐసీటీసీ కౌన్సిలర్ రవీందర్, ఎస్.టీ.ఎస్ శ్రీనివాస్, స్టాఫ్ నర్స్ అనూష, ఎన్జీవో సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక వేదనతో వృద్ధుడి బలవన్మరణం

గన్నేరువరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఒంటరిగా జీవించలేక మానసికవేదనకు గురైన ఓవృద్ధుడు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ తాండ్ర నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామానికిచెందిన తాళ్లపల్లి పరశురాములు(80) వృద్ధాప్యంలో ఒంటరితనంతో జీవించలేక మానసికంగా విసిగిపోయి గురువారం ఉదయం తన ఇంట్లో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఐదేండ్ల క్రితం మృతిచెందగా వీరికి ఒక కుమారుడు, ముగ్గురు కూతుళ్లు. అందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. కుమారుడు ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. మృతుడి కోడలు అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి పంపించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మతిస్థిమితం సరిగా లేక తండ్రిని చంపిన తనయుడు

రాయికల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం మైతాపూర్ గ్రామంలో మానసిక స్థితి సరిగా లేక తొట్లె ఎర్రయ్య (65) అనే వ్యక్తిని కన్న కొడుకు మల్లేష్ గొడ్డలితో గురువారం దాడిచేసి హతమార్చాడు. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. ఎర్రయ్య కొడుకు మల్లేష్‌కు కొన్నేళ్లుగా మానసిక పరిస్థితి సరిగాలేదు. చిన్నప్పుడేతల్లి కూడా మరణించడంతో మల్లేష్ ఆలనాపాలనా ఎర్రయ్యనే చూసుకుంటున్నాడు. మానసిక స్థితి సరిగాలేక మల్లేష్ తరచూ తనతండ్రి ఎర్రయ్యతో గొడవ పడుతుండేవాడు. ఎర్రయ్య స్థానికంగా కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం ఇంటికి వచ్చిన ఎర్రయ్యతో మల్లేష్ గొడవపడి గొడ్డలితో దాడిచేయగా తలకు, కాళ్లకు తీవ్రగాయాలై మరణించాడు. కులపెద్దమనిషి నాగుల గంగమల్లయ్య ఫిర్యాదు మేరకు రాయికల్ ఎస్సై సుధీర్‌రావు కేసు నమోదు చేశాడు. జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పెద్దపల్లి రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలంలోని కొత్తపల్లి గ్రామానికిచెందిన బూర్ల జనార్దన్(45) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. కుటుంబసభ్యులు ఎన్నిసార్లు చెప్పినా మానలేదు. బుధవారం సాయంత్రం జనార్దన్ అతిగామద్యం సేవించి ఇంటికి వచ్చాడు. భార్య ఉమతో మద్యం ఎందుకు తాగుతున్నావని మందలించింది. ఆమెపై చేయి చేసుకోవడంతో అదే గ్రామంలోని తల్లి దగ్గరికి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం ఉదయం ఇంటికి వచ్చి ఎంత పిలిచినా తలుపు తీయకపోవడంతో కిటికీ నుంచి చూసేసరికి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య జయ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి రైతు మృతి


ప్రవీణ్(ఫైల్)

మల్లాపూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలం రాఘవ పేట గ్రామంలో గురువారం ట్రాక్టర్ బోల్తా పడి చెదలు ప్రవీణ్(30) అనే రైతు మృతిచెందగా అతడి కుమారుడికి గాయాలయ్యాయి. ప్రవీణ్ ట్రాక్టర్‌తో తనభూమిని దున్ని పెద్ద కుమారుడు శ్రీహన్(10)ను కూర్చోబెట్టుకొని బయటకు వస్తుండగా ట్రాక్టర్ బోల్తాపడింది. ఆ సంఘటనలో కుమారుడు శ్రీహన్ పక్కకు పడిపోయాడు. ప్రవీణ్ ట్రాక్టర్ కిందే ఉండిపోయాడు. పొలం సమీపంలో గల రైతులు సహాయక చర్యలు చేపట్టగా ప్రవీణ్ అప్పటికే చనిపోయాడు. కుమారుడిని చికిత్స నిమిత్తం మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య


నాగరాజు(ఫైల్)

మల్యాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం నూకపల్లి డబుల్‌బెడ్ రూం ఇళ్లలో నివాసముండే క్షీరసాగరం నాగరాజు(39) అనేవ్యక్తి అప్పుల బాధతో బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై నరేశ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం నాగరాజుకు నాలుగు లక్షల రూపాయల అప్పు అయింది. బుధవారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిన నాగరాజు సమీపంలోగల బైపాస్ దారి పక్క బావిలోదూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పు ఇచ్చిన వారు తన కుటుంబసభ్యులను ఇబ్బంది పెట్టవద్దని మృతుడు ఓ చీటీ రాసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రయాణికులకు తప్పని తిప్పలు

- మెట్‌పల్లి బస్టాండ్‌లో అసౌకర్యాలు
- సరిపడా ప్లాట్‌ఫాంలు లేక ఇబ్బందులు
- నిత్యం 50 వేల మంది రాకపోకలు
- వసతులు కల్పించాలంటున్న ప్రయాణికులు

మెట్‌పల్లిటౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమస్యలకు నిలయంగా మారింది. ప్రయాణికులకు సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నిత్యం 50 వేల మంది ప్రయాణికులు ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. ప్రతి నెలా లక్షల్లో ఆదాయం వస్తున్నప్పటికీ ప్రయాణికులకు ఆర్టీసీ అధికారులు సరైన సౌకర్యాలు కల్పించడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ప్రయాణికులు కూర్చోవడానికి సరైన ప్లాట్‌ఫాంలు లేవు. మెట్‌పల్లి బస్టాండ్ నుంచి నిజామాబాద్, వరంగల్, ఆదిలాబాద్, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలకు ఇక్కడి నుంచి నిత్యం 50 వేల మంది ప్రయాణికులు రాకపోకలు కొనసాగిస్తుంటారు.

డిపో పరిధిలో మొత్తం 50 బస్సులు ఉండగా వివిధ ప్రాంతాల నుంచి వందలో సంఖ్యలో బస్సులు మెట్‌పల్లి బస్టాండ్‌కు వస్తుంటాయి. ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, రైతులు పెద్ద సంఖ్యలో రాకపోకలు కొనసాగిస్తుంటారు.



మెట్‌పల్లి బస్టాండ్

అసౌకర్యం.. అపరిశుభ్రత

బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులకు కూర్చునేందుకు వసతితో పాటు, మంచినీరు, సరిపడా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. గతంలో నిర్మించిన మూత్రశాలలు నిరుపయోగంగా ఉన్నాయి. మహిళలకు సరిపడా మూత్రశాలలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్న మూత్రశాలలు పరిశుభ్రంగా లేవని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. బస్టాండ్ ఆవరణలో చెత్తచెదారంతో పాటు మురికినీరు నిలుస్తోంది. ఇప్పుడే ఇలా ఉంటే వర్షాలు పడితే పరిస్థితి మరింత అధ్వానంగా మారే అవకాశం ఉంది. వేల సంఖ్యలో రాకపోకలు సాగించే బస్టాండ్‌లో కేవలం 5 ప్లాట్‌ఫాంలు మాత్రమే ఉండటంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే పాఠశాలలు, కళాశాలలు ప్రారంభం అయితే రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్లాట్ ఫాంల సంఖ్యతో పాటు బస్టాండ్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్లాట్‌ఫాంల సంఖ్య పెంచుతాం

దేవరాజ్, డిపో మేనేజర్, మెట్‌పల్లి

ప్రయాణికుల రద్దీతో బస్టాండ్‌లో సౌకర్యాలు, ప్లాట్ ఫాంల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే ప్లాట్ ఫాంల సంఖ్య పెంచుతాం. బస్టాండ్‌లో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పిస్తాం.




నిరుపయోగంగా ఉన్న మూత్రశాలలు, అపరిశుభ్రంగా ఉన్న బస్టాండ్ ఆవరణ, ప్రయాణికులతో కిటకిటలాడుతున్న బస్టాండ్

మంత్రివర్గ విస్తరణలో
మాదిగలకు ప్రాతినిధ్యం కల్పించాలి

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నేతృత్వంలో అధిష్టానాన్ని కలిసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు


ఢిల్లీలో మల్లికార్జున ఖర్గేను కలిసి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నేతృత్వంలోని ఎమ్మెల్యేలు

తిమ్మాపూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు చోటు కల్పించాలని మాదిగ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నేతృ త్వంలో ఎమ్మెల్యేలు మందుల సామెల్ (తుంగతుర్తి), అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ (ధర్మపురి), తోట లక్ష్మీకాంత రావు(జుక్కల్), కలె యాదయ్య(చేవెళ్ల) ఢిల్లీలో అఖిలభారత కాంగ్రెస్‌కమిటీ జాతీయఅధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సంస్థాగత వ్యవహారాల ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను విడివిడిగా కలిసి వినతిపత్రాలు సమర్పించారు. రాష్ట్ర మంత్రివర్గంలో ప్రస్తుతం ఖాళీగాఉన్న ఆరుస్థానాల్లో భర్తీ చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కసరత్తు చేపట్టారని, ఈమంత్రివర్గ విస్తరణలో మాదిగలకు అవకాశం కల్పించాలని కోరారు. జనాభా నిష్పత్తి ప్రకారమే కాకుండా సామాజిక సమీకరణలను దృష్టిలో పెట్టుకొని మాదిగలకు అవకాశం కల్పించాలని కోరారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మాదిగలు 33లక్షల మంది ఉన్నారని, తాజా లెక్కల ప్రకారం ఈ సంఖ్య రెట్టింపైన విషయాన్ని వారు గుర్తుచేశారు. ఈ లెక్కన మాదిగలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని కోరారు. మంత్రివర్గ విస్తరణలో తమకు న్యాయం జరుగుతుందని మాదిగలు ఆశలు పెట్టుకున్నారని, వారిఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా మంత్రివర్గంలో మాదిగలకు అవకాశం కల్పించేలా చూడాలని వారు కోరారు. మాకు మంత్రి వర్గంలో స్థానం కల్పిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి లాభం చేకూరుతుందన్నారు.

గోదావరిఖనిలో కారు బీభత్సం

- విద్యుత్ స్తంభాన్ని ఢీకొని పాఠశాల గోడపైకి ఎక్కిన కారు
- ఒకరికి తీవ్రగాయాలు

కోల్‌సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పరశురాం నగర్‌లో గురువారం తెల్లవారుజామున కారు బీభత్సం సృష్టించింది. ప్రభుత్వ పాఠశాల వద్ద విద్యుత్ స్తంభానికి వేగంగా ఢీకొట్టడంతో స్తంభం విరిగింది. కారు వెనుక భాగం ప్రభుత్వ పాఠశాల గోడపైకి ఎక్కింది. ఘటనజరిగిన సమయంలో కారులో తిలక్‌నగర్ ప్రాంతా నికి చెందిన దార రోహిత్ అలియాస్ చింటు, అక్షయ్‌కుమార్ అనేఇద్దరు యువకులు ఉన్నారు. ఈఘటనలో దార రోహిత్‌కు గాయాలుకాగా లక్ష్మీనగర్‌లోని ఒకప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు. తిలక్‌నగర్‌కు చెందిన ప్రశాంత్ అనే ఫొటోగ్రాఫర్ వద్ద ఉన్న కారును బుధవారం అర్ధరాత్రి తరువాత ఇద్దరు యువకులు తీసుకుని వెళ్లారు. ఇతర స్నేహితులతో కలిసి మద్యంసేవించారు. తెల్లవారుజామున 4గంటలకు ఫైవింక్లయిన్ సెంటర్‌లో టిఫిన్‌చేసి కారులో పరశురాంనగర్‌వైపు వేగంగా వస్తుండగా అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టింది. భారీశబ్దంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. విద్యుత్‌వైర్లు తెగిపడ్డాయి. ఘటన జరిగిన సమయంలో అక్షయ్ కుమార్ కారు నడుపుతున్నట్టు తెలుస్తోంది. సేఫ్టీ బెలూన్లు తెరుచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది.

తెల్లవారే దాకా ఇదే తంతు...

తిలక్‌నగర్ ప్రాంతంలో దూళ్‌పేటగా చెప్పుకునే సిక్ హాస్పిటల్ ఏరియాకు చెందిన కొందరు యువకులు అర్ధరాత్రి నుంచి తెల్లవారు వరకు చిత్తుగా మద్యం సేవించి గొడవలకు దిగుతున్నారు. గతంలో తెల్లవారే వరకు మద్యం సేవించిన ముగ్గురు యువకులు ఉదయం 4గంటలకు ఫైవింక్లయిన్ ఏరియాలో టిఫిన్ చేసేందుకు వెళ్లి అక్కడికి వచ్చిన మరికొందరితో గొడవపడి హత్యాయత్నం చేశారు. ఆ కేసులో దార రోహిత్‌కూడా నిందితుడే. మళ్లీ అదేయువకుడు కారు బీభత్సంలో ఉన్నాడు. ఈఘటనపై గురువారం సాయంత్రం వరకుఎవరూ ఫిర్యాదు చేయలేదు. సింగరేణి ఎలక్ట్రికల్ అధికారులు ఫిర్యాదు చేయాల్సి ఉండగా వెనుకాడుతున్నట్టు తెలుస్తోంది.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- కరీంనగర్ సీపీ గౌస్ ఆలం

చిగురుమామిడి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు, క్రీడల్లో రాణించాలని కరీంనగర్ సీపీ గౌస్ ఆలం అన్నారు. ఈ నెల 12నుంచి 15వరకు డెహ్రాడూన్‌లో జరిగే జాతీయస్థాయి కరాటేపోటీలకు ఎంపికైన ఎ సాయిమిథన్‌రెడ్డిని గురువారం కరీంనగర్ సీపీ గౌస్ ఆలం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నవయస్సులో జాతీయస్థాయిలో పాల్గొనే అవకాశం రావడం సంతోషమన్నారు. కార్యక్రమంలో జపాన్ కరాటే అసోషియేషన్ ఇండియాన్ షాటోకాన్ కరాటే రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టరు బొల్లి ఐలయ్య, కోశాధికారి బండారిపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి పడి యువకుడికి తీవ్రగాయాలు

ఓదెల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్కపల్లి 29వ రైల్వే గేట్ వద్ద దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌నుంచి పడి గోదావరిఖనికి చెందిన కంకనాల సంతోష్ అనే యువకుడు తీవ్రగాయాలపాలయ్యాడు. సికింద్రాబాద్ నుంచి రామగుండంకు దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో వస్తుండగా డోర్ వద్ద ఉన్న సంతోష్ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తీవ్రగాయాలతో కొట్టుమిట్టాడుతున్న సంతోష్‌ను పొత్కపల్లి ఎస్‌ఐ దీకొండ రమేష్ సూచనల మేరకు బ్లూకోట్ సిబ్బంది శంకర్, శివశంకర్‌లు సంఘటన స్థలానికి చేరుకుని అంబులెన్స్‌లో సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మట్టిని తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

ఎల్లారెడ్డిపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి గ్రామ శివారులోని ఆర్‌ఐ శ్రవణ్ ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం పట్టుకున్నారు. వాహనాలను తహసీల్ కార్యాలయానికి తరలించారు. వెంకటాపూర్ నుంచి అక్రమంగా మట్టిని రవాణా చేస్తున్నారనే సమాచారంతో కాపు కాచి పట్టుకున్నామని ఆర్‌ఐ శ్రవణ్ పేర్కొన్నారు.

బాలిక అదృశ్యం

జగిత్యాల క్రైం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మేడిపల్లి మండలం కాసారం గ్రామానికి చెందిన బాలిక(17) బుధవారం జిల్లా కేంద్రంలోని నిజామాబాద్ రహదారిలో అదృశ్యం అయ్యింది. బాలిక తన ఇంటి నుంచి బుధవారం జగిత్యాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. యువతితండ్రి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

పెద్దపల్లి రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవునిపల్లికి చెందిన కుమ్మరి నర్సయ్య అనే రైతు గేదె విద్యుత్‌షాక్ గురై మృతి చెందింది. ఇంటి వద్ద గేదె కోసం ఏర్పాటు చేసిన షెడ్డు వద్ద ఉన్న మినీ ట్రాన్స్‌ఫార్మర్ సపోర్టు వైరుకు విద్యుత్ సరఫరా జరిగి గేదెకు తగిలి షాక్‌కు గురై మృతి చెందినట్లు తెలిపారు. గేదె మృతి చెందడంతో సుమారు 80 వేలరూపాయల వరకు నష్టపోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

అట్రాసిటీ కేసుపై విచారణ

శంకరపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కరీంపేట గ్రామంలో ఎస్సీ సామాజికవర్గం వారిని అదేగ్రామానికి చెందిన ఓ కుటుంబ సభ్యులు కులం పేరుతో దూషించారని మేరుగుశ్రీనివాస్ ఇతరులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం హుజూరాబాద్ ఏసీపీ మాధవి విచారణ చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 22న రాత్రి 9గంటల సమయంలో గడ్డం మల్లవ్వ అతని కుమారుడు గడ్డం రాజు ఇంటి నుంచి కేకలు, అరుపులు వినపడగా సమీపంలో ఉన్న మేరుగు శ్రీనివాస్‌తోపాటు కొంతమంది అక్కడికి వెళ్లి చూశారు. గడ్డం మల్లవ్వ అతని కుమారుడు రాజు, తన భార్య రేణుక(స్వప్న)ను కొడుతుండగా ఎందుకు కొడుతున్నారని శ్రీనివాస్‌తోపాటు మెరుగు తిరుపతి, బొజ్జ బిక్షపతి, స్వామి, నాగమ్మ మరికొంత మంది అడిగారు. మా కోడలును మేము ఏమైనా చేసుకుంటామని, మీకెందుకు అని ఇష్టం వచ్చినట్లు కులంపేరుతో దూషించినట్లు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఏసీపీ మాధవి ఇరువర్గాలను విచారించి, సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసుకున్నారు.

అదుపు తప్పి ధాన్యం లారీ బోల్తా

మంథనిరూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎక్లాస్‌పూర్ సమీపంలో గాడుదులగండి గుట్ట మూల మలుపు వద్ద వడ్ల ధాన్యం లారీ అదుపుతప్పి లోయలో పడింది. గురువారం ఉదయం భూపాలపల్లి జిల్లా నుంచి సుల్తానాబాద్‌కు ధాన్యాన్ని తీసుకెళ్తున్న లారీ అదుపు తప్పడంతో గుట్టపైనుంచి లోయ పడిందని స్థానికులు తెలిపారు. లారీ లోయలో పడటంతో వడ్ల బస్తాలు చిందరవందరగా పడిపోయాయి. ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వృద్ధురాలిని తప్పించబోయి..

- బైక్‌పైకి దూసుకెళ్లిన లారీ
- దంపతుల దుర్మరణం
- గాయాలతో బయటపడిన చిన్నారి

సుల్తానాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదం ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. లారీ రూపంలోవచ్చిన మృత్యువు తల్లిదండ్రులను బలి తీసుకోగా మూడేళ్ల చిన్నారి గాయాలతో బయట పడింది. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్‌కు చెందిన గుంటిపల్లి రాములు (28) ఆయన భార్య అనూష (25)లు చిన్నారి సహస్ర(3)తో కలిసి సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్‌లో జరుగనున్న బంధువుల వివాహానికి హాజరుకావడానికి గురువారం రాత్రి బైక్‌పై బయలుదేరారు. సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధి సుగ్లాంపల్లి స్టేజీ వద్ద రాజీవ్‌రహదారిపై నడుచుకుంటూ వస్తున్న వృద్ధురాలిని తప్పించే యత్నంలో లారీ డివైడర్ దాటి ఎదురుగా వస్తున్న బైక్‌పై నుంచి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో అనూష అక్కడికక్కడే మృతిచెందగా ఆమెభర్త రాములుకు తీవ్ర గాయాల య్యా యి. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ సుబ్బారెడ్డి, ఎస్‌ఐ శ్రావణ్ కుమార్‌లు ఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్థుల సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రు లను పోలీస్‌వాహనంలోనే సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రాములు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. చిన్నారి సహస్ర స్వల్ప గాయాలతోచికిత్స పొందుతోంది. కాగా ప్రమాదం జరిగిన వెంటనేతాము 108అంబులెన్స్‌కు ఫోన్ చేశా మని, ఆలస్యంగావచ్చిందని గ్రామస్థులు ఆరోపించారు.

బసంత్‌నగర్‌లో విషాదం..

పాలకుర్తి (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని బసంత్‌నగర్ రాంనగర్‌లో నివాసముండె గుంటుపెల్లి రాములు, అనూషలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. మూడేళ్ల చిన్నారి సహస్రతో కలిసి ద్విచక్ర వాహనం పై వెళ్తుండగా సుగ్లాంపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి చెందారు. రాము 12 ఏళ్ల వయస్సులోనే తండ్రి కుమారస్వామి మృతి చెందాడు. తల్లి పద్మ పెంచి పెద్దచేసింది.. రాము లారీ డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. కొడుకు అకాల మృతితో తల్లి పద్మ రోదనలు మిన్నంటాయి. అనూష స్వగ్రామం హుజూరాబాద్ మండలం అమ్మనగుర్తి.


చికిత్స పొందుతున్న మూడేళ్ల చిన్నారి సహస్ర

ఎదురెదురుగా ఢీకొన్న రెండు లారీలు..

- ఒకరి మృతి.. మరో ఇద్దరికి తీవ్రగాయాలు

హుజూరాబాద్‌రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మనపల్లి గ్రామశివారులోని కాకతీయ కాలువ బ్రిడ్జివద్ద రెండులారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం 7.30గంటల ప్రాంతంలో కరీంనగర్ వైపు నుంచి, అటు వరంగల్ వైపు నుంచి వస్తున్న రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ప్రకాశం జిల్లా టంగుటూరు గ్రామానికి చెందిన దాచేపల్లి కృష్ణకిషోర్(44) లారీక్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. అతికష్టం మీద క్షతగాత్రుడికి బయటకితీసి చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించే లోపే మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కాగా లారీక్లీనర్ మస్తాన్, మరో డ్రైవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా రెండులారీలు బ్రిడ్జిపై ఢీకొని ఉండటంతో అటు వరంగల్, ఇటు కరీంనగర్‌కు వెళ్లే వాహనదారులు తీవ్రఇబ్బందులు పడాల్సివచ్చింది. పోలీసులు వాహనాలను దారి మళ్లించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ ఘట నపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నారు.


ఘటన స్థలం వద్ద సహాయక చర్యలు చేపడుతున్న పోలీసులు

- ప్రమాద స్థలాన్ని పరిశీలించిన వొడితెల ప్రణవ్

ప్రమాదస్థలాన్ని నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి వొడితెలప్రణవ్ పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను సీఐ కరుణాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. హైవేపై తరుచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలని సీఐకి సూచించారు.

వివాహిత అదృశ్యం

- కేసు నమోదు

మెట్‌పల్లి రూరల్, జూన్, 5 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యంపై గురువారం కేసు నమోదు చేసినట్లు మెట్‌పల్లి ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. వెల్లుల్ల గ్రామానికి చెందిన బోదాసు నళిని(21) అనే వివాహిత నిర్మల్ జిల్లా మామడ మండలం దిమ్మతుర్తి గ్రామానికి ఈనెల 4న ఉదయం వెళ్లింది. తిరిగి ఇంటికి వస్తున్నానని ఖానాపూర్ బస్సు ఎక్కినట్లు తెలిపింది. సాయంత్రం గడిచినా ఇంటికి తిరిగి రాలేకపోవడంతో ఆమె కోసం కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె అక్క బోదాసు మౌనిక ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పెళ్లి బృందం వాహనాన్ని ఢీకొట్టిన డీసీఎం వ్యాన్

- నాలుగు నెలల బాబు దుర్మరణం
- పెళ్లి కొడుకుతో పాటు ఆరుగురికి గాయాలు


రుద్ర (ఫైల్)

మల్యాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలజిల్లా మల్యాల మండలం కొండగట్టు సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పెళ్లిబృందం ప్రయాణిస్తున్న కారును డీసీఎం వ్యాన్ ఢీకొట్ట డంతో నాలుగు నెలల బాబు వాగేరి రుద్ర మృతిచెందగా కారులోని పెళ్లి కొడుకు మహేశ్‌మెట్కర్‌తోపాటు మరో ఆరుగురికి గాయాలయ్యాయి. గురువారం ఉదయం జరిగే వివాహం కోసం మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి బయలుదేరిన పెళ్లి బృందం వాహనం మరో గంటన్నరలో పెళ్లి మండపానికి చేరుకునేలోపు ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా చిక్కలవాడీకి చెందిన హరి మెట్కర్ పెద్ద కుమారుడు మహేశ్‌మెట్కర్‌కు కరీంనగర్ జిల్లా హుజూ రాబాద్‌కు చెందిన ఓ యువతితో గురువారం వివాహం నిశ్చయం అయింది. నాందేడ్‌నుంచి కారులో పెళ్లికొడుకు, కుటుంబసభ్యులు, మరోవాహనంలో బంధువులు బుధవారం రాత్రి హుజూరాబాద్‌కు బయలుదేరారు. గురువారం వేకువజాము నాలుగు గంటల సమయంలో కొండగట్టు సమీపానికి చేరుకోగానే ఎదురుగా ఖమ్మం నుంచి మామిడి కాయల లోడ్‌తో వస్తున్న డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. దీంతో కారు పూర్తిగా ధ్వంసం కాగాఅందులోని హరిమెట్కర్ మనవడు(కూతురి కుమారుడు) వాగేరి రుద్ర ముక్కులో నుంచి రక్తస్రావం అయి మృతిచెందాడు. ఈ ప్రమాదంలో పెళ్లి కొడుకుతోపాటు తండ్రి హరిమెట్కర్, కూతురు శీతల్, అల్లుడు దినేశ్, అన్న కూతుళ్లు లింగమ్మ, మరుబాయి, పౌడే సోనాలి గాయపడగా చికిత్స కోసం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన పెళ్లికొడుకు మహేశ్, అతని బావ దినేశ్‌ను మెరుగైన వైద్యంకోసం వారి స్వస్థలం నాందేడ్‌కు తీసుకెళ్లారు. హరిమెట్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా ఈ ప్రమాదంలో పెళ్లి కొడుకు మహేశ్ గాయపడడంతో గురువారం జరగాల్సిన వివాహం నిలిచిపోయినట్లు వరుడి కుటుంబసభ్యులు తెలిపారు.

ఆగిపోయిన పెళ్లి

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని ఇందిరానగర్‌లో ఓ యువతి పెళ్లి జరగాల్సి ఉండగా గురువారం నిలిచిపోయింది. నెలరోజుల క్రితం నాందేడ్‌కు చెందిన వరుడితో వివాహం నిశ్చయమైంది. వరుడు నాందేడ్ నుంచి కారులో వస్తుండగా, జగిత్యాల జిల్లా కొండగట్టు వద్ద డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. దీంతో వివాహం ఆగిపోయింది.

మున్సిపల్ కార్యాలయంలో మహిళ హల్‌చల్

- ఇంటి నిర్మాణ అనుమతి ఇవ్వడం లేదని ఆగ్రహం
- టీపీఎస్ ఫిర్యాదుతో కేసు నమోదు

కరీంనగర్ అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తాను నిర్మించుకుంటున్న ఇంటికి మున్సిపల్‌కార్పొరేషన్‌లో దరఖాస్తు చేసినప్పటికీ అనుమతి ఇవ్వడం లేదంటూ కరీంనగర్ పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన గంగాభవానిఅనే మహిళ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం టీపీవో ఉద్యోగులతో గొడవకు దిగింది. ఉద్యోగులపై ఆగ్రహంవ్యక్తం చేస్తూ బీరువా, కంప్యూటర్లను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించగా ఉద్యోగులు అడ్డుకున్నారు. గంగాభవాని ఇంటినిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోగా, ఆమె అత్తామామలు అనుమతి ఇవ్వవద్దని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదుచేశారు. దీనిపై టీపీవో అధికారులు విచారణ జరుపగా ఆస్థలం ప్రభుత్వ భూమిగా నిర్ధారణ అయింది. తహసీల్దార్ నుంచి క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకురావాలని టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు గంగాభవానికి చెప్పారు. అయినప్పటికీ ఇంటి నిర్మాణపనులను గంగాభవాని ప్రారంభించడంతో టీపీవో అధికారులు నిర్మాణ సామగ్రిని స్వాధీనంచేసుకున్నారు. దీంతో ఆగ్రహించిన గంగాభవానీ ఉద్యోగులు లంచాలు తీసుకుని అనుమతి ఇవ్వకుండా తొక్కిపెడుతున్నారని దూషణకు దిగింది. ఆతర్వాత పోలీసులు సంఘటనస్థలానికి చేరుకుని ఆమెను అదుపులోకి తీసుకున్నారు. గంగాభవాని మున్సిపల్ కార్యాయలంలోని దౌర్జన్యంగా ప్రవేశించి తమవిధులకు ఆటంకం కలిగించి ప్రభుత్వఆస్తిని ధ్వంసం చేసి, ప్రభుత్వఅధికారిని దూషించి, చంపుతానని, ఇంటి అనుమతి ఇవ్వకుంటే చనిపోతానని బెదిరించినట్లు టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ దేవసాని సంధ్య కరీంనగర్ వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు గంగాభవానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వన్‌టౌన్ సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు.


ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం (ఫైల్)

ధాన్యం కొనుగోళ్లతో ఆర్థికాభివృద్ధి

- రూ. 39 లక్షలు ఆర్జించిన 12 సంఘాలు
- ఆదర్శంగా నిలుస్తున్న చొప్పదండి గ్రామైక్య సంఘాలు

వారంతా గ్రామాల్లో కూలి పనులు చేసుకుంటూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండే సామాన్య మహిళలు. కుటుంబమే లోకమని అనుకునే వారంతా సంఘంగా ఏర్పడ్డారు. మార్కెటింగ్ ఎలా చేయాలో తెలియదు. ప్రభుత్వ ప్రోత్సాహంతో కొనుగోళ్లపై అవగాహన పెంచుకున్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టి రాణిస్తున్నారు. చొప్పదండి మండలంలో రబీలో 12 కేంద్రాల్లో లక్షకుపైగా క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసిన గ్రామైక్య సంఘాలు జిల్లాలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయి. దాదాపు 35 లక్షల రూపాయలను కమీషన్ రూపంలో మహిళా సంఘాలు ఆర్జించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘ మహిళల విజయగాథపై కథనం...

చొప్పదండి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో గత ఏప్రిల్‌లో 12 గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. భూపాలపట్నం, చిట్యాలపల్లి, దేశాయిపేట, గుమ్లాపూర్, కాట్నపల్లి, కొలిమికుంట, కోనేరుపల్లి, మంగళపల్లి, పెద్దకుర్మపల్లి, రేవెల్లి, సాంబయ్యపల్లి, వెదురుగట్టలో కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేశారు. గ్రామైక్య సంఘాలు, స్వయం సహాయక సంఘాల మహిళలు పగలు, రాత్రి కష్టపడి కేంద్రాలను నిర్వహించారు. రైతుల నుంచి లక్షకుపైగా క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించి సకాలంలో రైస్ మిల్లులకు తరలించారు. ఐకేపీ సిబ్బంది సంఘాలకు పూర్తి స్థాయిలో సహకారం అందించగా, సంఘాలు మరి కొంత మందికి ఉపాధి కల్పించారు.

1,21,895 క్వింటాళ్ల ధాన్యం సేకరణ

రబీ సీజన్‌లో 12 కొనుగోలు కేంద్రాల ద్వారా 1,21,895 క్వింటాళ్ల ధాన్యం రైతుల నుంచి సేకరించారు. గత ఖరీఫ్ కన్నా ఈ సారి అధికంగా కొనుగోలు చేశారు. పెద్దకుర్మపల్లి కొనుగోలు కేంద్రంలో అత్యధికంగా 28,524 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. గుమ్లాపూర్‌లో 10,040 క్వింటాళ్లు, వెదురుగట్టలో 11,158 క్వింటాళ్ల ధాన్యాన్ని మహిళా సంఘాలు సేకరించారు. మహిళలు సేకరించిన ధాన్యానికి క్వింటాలుకు రూ. 32 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం కమీషన్ అందజేస్తుండగా, మండలంలో 12 సంఘాలు 39 లక్షల 640 రూపాయలను కమీషన్ రూపంలో ఆర్జించారు. పెద్దకుర్మపల్లి గ్రామైక్య సంఘం 9 లక్షల 12 వేల 768 రూపాయలను ఆర్జించింది.



సమర్థవంతంగా పనిచేశారు
నర్మద, ఐకేపీ ఏపీఎం, చొప్పదండి

ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మహిళా సంఘాలు సమర్థవంతంగా పనిచేశారు. మండల సంఘాలు జిల్లావ్యాప్తంగా మంచి పేరు సాధించాయి. ధాన్యం సేకరణతో సంఘాలు లక్షలాది రూపాయల ఆదాయాన్ని సమ కూర్చుకుంటున్నా యి. పురుషులకు దీటుగా ధాన్యం కొనుగోళ్లలో మహిళలు రాణిస్తూ మన్ననలను పొందుతున్నారు.



అందరి సహకారంతో సాఫీగా కొనుగోళ్లు
ఉమ, గ్రామైక్య సంఘం కమిటీ మెంబర్, రేవెల్లి

అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, వ్యాపారులు అందరి సహకారంతో కొనుగోళ్లను సాఫీగా పూర్తి చేశాం. కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని తూకం వేసి మిల్లులకు పంపించి, రైతులకు నగదు వచ్చే వరకు అప్రమత్తంగా ఉన్నాం. రైతులకు ఎలాంటి నష్టం, జాప్యం జరగకుండా పనిచేశాం. సంఘానికి ఆదాయంతో పాటు మంచి పేరు వచ్చింది.



చామనపల్లికి ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు


అవార్డు అందుకుంటున్న చామనపల్లి గ్రామకార్యదర్శి కోరుకంటి మహేందర్ రావు

కరీంనగర్ రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలోని చామనపల్లి గ్రామ పంచాయతీకి రాష్ట్ర ఉత్తమ పంచాయతీ అవార్డు లభించింది. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో దేవాదాయ, పర్యావరణ, అటవీశాఖ మంత్రి కొండాసురేఖ చేతుల మీదుగా పంచాయతీకార్యదర్శి కోరుకంటి మహేందర్‌రావు అవార్డును, ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. ఈ అవార్డుకు రాష్ట్రంలో 3గ్రామపంచాయతీలు ఎంపికవగా చామనపల్లి మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి జగన్మోహన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కె మహేందర్‌రావును, సిబ్బందిని మంత్రి అభినందించారు. చామనపల్లిలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, స్వచ్ఛదనం, పచ్చదనం సక్రమ నిర్వహణ, సెగ్రిగేషన్, కంపోస్టు ప్రిపరేషన్, విటమిన్ గార్డెన్, ప్లాస్టిక్ వ్యర్థల సక్రమ నిర్వహణ, ప్లాంటేషన్, నర్సరీ, కమ్యూనిటీ సోక్ పిట్స్ వంటిఅంశాల్లో చామనపల్లి అత్యుత్తమ తీరు కనబరిచింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్‌సెక్రెటరీ అహ్మద్ నదీమ్, టీఎస్‌పీసీబీ మెంబర్, సెక్రెటరీ రవి, చామనపల్లి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుడికి చిక్కిన 14కిలోల చేప


14 కిలోల చేపతో మత్స్యకారుడు నర్సింలు

గంభీరావుపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టులో 14కిలోల చేప చిక్కింది. గంభీరావుపేటకు చెందిన నర్సింలు అనే మత్స్యకారుడు గురువారం రోజులాగే మానేరులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. నర్సింలు వలకు 14 కిలోల చేప చిక్కింది. మండల కేంద్రంలోని చేపల మార్కెట్‌కు నర్సింలు చేపను తీసుకరాగా అందరూ ఆసక్తిగా తిలకించారు.

ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్


పొరండ్లలో ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్న అధికారులు, రైతులు

తిమ్మాపూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొరండ్లలో జిల్లాఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ, లోహియా ఎడిబిలయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన అధికారి ఆర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వరిపంటకు ప్రత్యామ్నాయంగా మార్కెట్లో డిమాండ్ ఉన్న ఆయిల్‌పామ్ పంట వేసుకోవాలని సూచించారు. ఒక టన్ను పామ్ ఆయిల్ గెలల ధర 20,058 రూపాయలు ఉందని, ఒక ఎకరానికి 10 టన్ను లదిగుబడి వస్తుందని, దీంతో సంవత్సరానికి లక్షకు పైగా ఆదాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆయిల్‌పామ్ రైతు చాటీ రాజేశ్వరావు, బొమ్మిడి విజయ్‌కుమార్, ఉద్యానవనాధికారి రవళి, లోహియా ఎడిబిల్ అయిల్స్ మేనేజర్ విజయభరత్, ఏఈఓ పూర్ణ చందర్, ఫీల్డ్‌ఆఫీసర్ రాజ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు



ముస్తాబాద్‌లో అరెస్టును చూపుతున్న పోలీసులు

ముస్తాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మిస్సింగ్ కేసును పోలీసులు 24గంటల్లో ఛేదించారు. మండలంలోని గూడురుకు చెందిన జంపెల్లి మల్లయ్య(72) కనబడటం లేదని జంపెల్లి మల్లవ్వ ఫిర్యాదుచేసింది. కేసు నమోదు చేసుకొని ఎస్సై గణేశ్ దర్యాప్తును ప్రారంభించారు. సెల్‌ఫోన్‌ల సిగ్నల్ ఆధారంగా 24 గంటల్లో మిస్సింగ్ అయిన వ్యక్తిని కనుగొన్నారు. మల్లయ్యను విచారించగా ఈనెల 2వ తేదీన రాత్రి తన కుమారుడు పర్శరాములు డబ్బులు ఇవ్వడం లేదని కక్ష పెంచుకున్న బోయిన రాజేందర్,అతని స్నేహితుడు కలకోట రవి, నందినికారి సతీశ్ అనేకారు డ్రైవర్‌లు కిడ్నాప్‌చేసి కోరుట్లలోని ఒకరూంలో బంధించారని తెలిపారు. విచారణజరిపి బోయిన రాజేందర్, కలకోట రవి, సతీశ్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడదాం


జ్యూట్ బ్యాగులను ప్రదర్శిస్తున్న సభ్యులు

కరీంనగర్ కల్చరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ కోసం అందరం పాటుపడుదామని, గాలి, నీరు, నేల ప్లాస్టిక్ సంచులతో కలుషితం కాకుండా క్లాత్ లేదా జనపనార సంచులను వాడుదామని మానేరు పర్యావరణ పరిక్షణసమితి అధ్యక్షుడు తోట లక్ష్మణరావు అన్నారు. ప్రపంచపర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం వైశ్య భవన్‌లో గన్నీ బ్యాగులను ప్రదర్శించారు. పర్యావరణ దినోత్సవ బ్యానర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పలుచని ప్లాస్టిక్ సంచులు పీడనం, ఉష్ణోగ్రతల వద్ద చిరిగిపోయి సూక్ష్మ కణాలుగా గాలిలో వెదజల్లబడి భూతాపాన్ని పెంచుతాయన్నారు. కలుషితమైన ఆ గాలిని పీల్చడంతో శ్వాస కోశ, నాడీ మండల వ్యాధులు వస్తాయన్నారు. ప్లాస్టిక్ కణాలు గాలి నుంచి భూమిని చేరి పొలాల్లోని జీవసారాన్ని నశింపజేస్తాయని, పంట దిగుబడులను తగ్గిస్తాయని అన్నారు. కలుషిత నీటిని తాగి సున్నితమైన జీవజాతులు అంతరించి పోతాయన్నారు. సంస్థ సహాధ్యక్షుడు పెద్ది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అతిథులకు శుభకార్యాల్లో గన్నీ బ్యాగులు బహుమతిగా ఇవ్వాలన్నారు. వైశ్యసేవా కేంద్రం అధ్యక్షుడు చిదురసురేశ్ పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కన్న కృష్ణ, సామ నారాయణ, పెద్ది రామన్న, కొమురవెల్లి వేంకటేశం, నలుమాచు సుదర్శనం, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ ఫైనల్స్‌కు ఉమ్మడి జిల్లా జట్టు


ఫైనల్స్‌కు చేరిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలుర హ్యాండ్‌బాల్ జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలుర జట్టు ఫైనల్స్‌లోకి ప్రవేశించింది. నల్గొండజిల్లా నకిరేకల్ మండలం మంగళంపల్లిలో కొనసాగుతున్న ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు పలు జట్లపై విజయం సాధించింది సెమీ ఫైనల్‌కు చేరింది. గురువారం సాయంత్రం నిర్వహించిన సెమీ ఫైనల్స్‌లో నల్గొండపై విజయం సాధించి ఫైనల్స్‌కు చేరిందని జిల్లా జట్టు కోచ్ మూల వెంకటేశ్ తెలిపారు. ఈ సందర్భంగా జట్టును ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బాసరవేణి లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శి ఎన్ ప్రభాకర్ తదితరులు అభినందించారు.

గోశాలలో అనారోగ్యంతో ఉన్న రెండు కోడెల మృత్యువాత

- జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి

సిరిసిల్ల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న ఆలయ తిప్పాపూర్‌లోని గోశాలలో అనారోగ్యంతో ఉన్న రెండు కోడెలు మృత్యువాత పడ్డాయని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోశాలలో అనారోగ్యంతో ఉన్న కోడెలకు వెటర్నరీ వైద్యులు చికిత్సలకు అందిస్తున్నారని, కొత్తగా కోడెలు అనారోగ్యానికి గురికాలేదని తెలిపారు. గోశాలలో ఉన్న 1300 కోడెలలో ప్రస్తుతం 12 మాత్రమే అనారోగ్యంతో బాధపడుతున్నాయని తెలిపారు.



ఆర్వోబీ వద్ద కొనసాగుతున్న పనులు, పాత గేటు పక్కనే ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు

చురుగ్గా ఆర్వోబీ పనులు

- కొత్తగా డైవర్షన్ రోడ్డు ఏర్పాటు
- కేంద్ర మంత్రి బండి ఆదేశాలతో పనుల్లో కదలిక

కరీంనగర్ రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో ఎట్టకేలకు పురోగతి కనిపిస్తోంది. కరీంనగర్-తీగలగుట్టపల్లి రహదారిలో రైళ్ల రాకపోకలతో వాహనదారులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా రైల్వే శాఖ మూడేళ్ల క్రితం ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. దాదాపు రూ.150 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించిన పనులు ఏడాదిలోగా పూర్తవుతాయని అధికారులు ప్రకటించారు. మొదట్లో కొంత వేగంగా పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కొద్ది రోజుల తర్వాత పూర్తిగా నిలిపివేశారు. దీంతో రహదారి గుండా వెళ్లే వాహనదారులు నిత్యం అవస్థలు పడ్డారు. అర కిలో మీటర్ వరకు చేపట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులతో ఆ ప్రాంతం అంతా గుంతలమయంగా మారింది. వాహన దారులతోపాటు పాదచారులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైల్వే అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలు మార్లు ఫిర్యాదులు చేశారు. దీంతో స్థానిక ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆరు మాసాలుగా రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతోపాటు అమృత్ భారత్ నిధులతో రైల్వే స్టేషన్ పనులపై దృష్టి సారించారు. పలు మార్లు సంబంధిత కాంట్రాక్టర్‌లతో పాటు దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులకు పనులపై ఫిర్యాదు చేశారు. దీంతో దక్షిణ మధ్య రైల్వే అధికారులు స్టేషన్‌తో పాటు ఆర్వోబీ నిర్మాణ పనులను పరిశీలించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు.


గేటు పడడంతో ఆగిన వాహనాలు

రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను కొత్త కాంట్రాక్టర్‌కు అప్పగిస్తూ త్వరలోనే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఇందులో భాగంగా పనుల్లో వేగం పెంచారు. పాత రైల్వే గేటు పైనుంచి ఓవర్ బ్రిడ్జి పనులు సాగనున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా డైవర్షన్ రోడ్డుతోపాటు రైల్వే గేటును ఏర్పాటు చేశారు. ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చురుగ్గా సాగేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. ఎట్టకేలకు రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు చురుగ్గా చేపడుతుండడంపై వాహనదారులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పనులు మధ్యలో నిలిపి వేయకుండా పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి


రవికుమార్(ఫైల్)

మెట్‌పల్లి రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామ శివారులో గురువారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని ఇసుక ట్రాక్టర్ ఢీ కొనడంతో బండలింగాపూర్‌కు చెందిన గుగ్గిళ్ల రవి కుమార్(18) అనే యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బండలింగాపూర్ గ్రామానికి చెందిన గుగ్గిళ్ల రవికుమార్ ఆరోగ్య పరీక్షల నిమిత్తం మెట్‌పల్లి ఆసుపత్రికి వచ్చాడు. రాత్రి తిరిగి బండలింగాపూర్‌కు వెళ్తుండగా వెల్లుల్ల గ్రామ శివారులో ఎదురుగా ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో రవికుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా రవికుమార్ మృతి చెందినట్లు తండ్రి గుగ్గిళ్ల రాజు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


తిప్పాపూర్ గోశాలను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న కోడెల మృతి కలిచివేసింది

- విశాలమైన ప్రదేశంలో గోశాల నిర్మాణం చేపడతాం
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి గోశాలకు చెందిన కోడెల మృతి తనని ఎంతగానో కలిచివేసిందని ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యుడు ఆది శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. రాజన్న ఆలయ తిప్పాపూర్ గోశాలను ఈవో వినోద్‌రెడ్డి, వైద్యబృందంతో కలిసి పరిశీలించి కోడెల ఆరోగ్య వివరాలు వైద్య అధికారులను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల కొన్ని కోడెలు అనారోగ్యంతో మరణించడం చాలా బాధాకరమని, ప్రభుత్వం తరుపున సీఎం రేవంత్‌రెడ్డి కోడెల మరణాల విషయంలో వాకబ్ చేసి రాష్ట్ర స్థాయి అధికారులను పంపించారని తెలిపారు. పశుసంవర్ధక శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్, ఆలయ ఈవో, సిబ్బందితో పాటు అన్నివిభాగాల అధికారులు కోడెలను నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. సీజనల్ వ్యాధులు, అనారోగ్యంతోపాటు కొన్ని కోడెలకు లంపిస్కిన్ వ్యాధివచ్చినట్లు వైద్యాధికారులు తెలిపారన్నారు. 16మంది వైద్యసిబ్బంది కోడెలను పర్యవేక్షిస్తున్నారని అన్నారు. దాదాపు 18నుంచి 20కోడెలు అనారోగ్యం నుంచి కోలుకుని ఆర్యోగంగా ఉన్నట్లు తెలిపారు. వేములవాడలో విశాలమైన గోశాలను నిర్మాణం చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పించారని అన్నారు. కోడెమొక్కు భక్తుల విశ్వాసానికి నమ్మకానికి ప్రతీక అని రాజన్న ఆలయ కోడెలపై రాజకీయం చేయడం మానుకోవాలని సూచించారు. మొదటి దశలో సుమారుగా ఒక వెయ్యి కోడెలను రైతులకు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. భక్తులు సమర్పించే కోడెలలో కొన్నింటికి లంపీ స్కిన్ వ్యాధి ఉండటంతో ఇతర కోడెలకువ్యాపించినట్లు అధికారులు తెలిపారని వివరించారు.భక్తులు సమర్పించే కోడెలను పదిరోజులపాటు క్వారంటైన్‌లో పెట్టి తరవాత మిగతా వాటితో కలిపే విధంగా చూడాలని ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈవో వినోద్‌రెడ్డి, పశువైద్యాధికారులు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

గోశాలను సందర్శించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

తిప్పాపూర్ గోశాలలోని కోడెలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని వాటికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఆదేశించారు.

తిప్పాపూర్‌లోని గోశాలను గురువారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోశాల ఆవరణలో పారిశుధ్య పనుల కోసం అదనంగా వర్కర్లను నియమించేందుకు ఉద్యోగ ప్రకటన జారీ చేశామని, కోడెల సంరక్షణకు పకడ్బందీగా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోడెలకు అందిస్తున్న వైద్య చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గోశాలలో నిర్వహణ స్వయంగా పరిశీలించారు. కోడెలకు మెరుగైన దాణా, పచ్చిగడ్డి, తాగు నీరు అందించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఈవో వినోద్‌రెడ్డి, పశువైద్యబృందం, విశ్వహిందూ పరిషత్ సభ్యులు రాధా కిషన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

-జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ -ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా మొక్కలు నాటిన అధికారులు





జగిత్యాల్లో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మొక్క నాటుతున్న నవ వధువు మాళవిక, మెట్‌పల్లి కమిషనర్‌కు మొక్కలు అందజేస్తున్న అల్లాడి ప్రభాకర్

జగిత్యాల అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని 9వ వార్డులోని లింగం చెరువు వద్ద ఎమ్మెల్యే మొక్కలను నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగిత్యాల చుట్టు పక్కల ఉన్న పరసర ప్రాంతాలను పట్టణంలో కలపడం వల్ల వేగంగా చెందిందన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే ఐఎంఏ భవనంలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ స్పందన, మాజీ కౌన్సిలర్‌లు వొద్దినేని శ్రీలత, కొలగాని సత్యం, యాదాసు నవీన్, సిరికొండ రాజయ్య, ములాసపు మహేష్, ఏఈలు అనిల్, శరన్, పట్టణ ప్రణాళిక అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

●జగిత్యాల అగ్రికల్చర్: పట్టణంలోని విద్యానగర్‌లోగల స్థానిక శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ అభియాన్ జిల్లా కన్వీనర్ కస్తూరి సత్యం, కో కన్వీనర్ సత్యనారాయణతో పాటు బీజేపీ వివిధ హోదాల బాధ్యులు నలువాల తిరుపతి, జుంబర్తి దివాకర్, బొడ్డు పెద్ద గంగారాం, కొక్కు గంగాధర్, మర్రిపెల్లి సత్యం పాల్గొన్నారు.

●కోరుట్ల: కోరుట్ల మున్సిపల్ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు మొక్కలు నాటారు. పర్యావరణ, ప్లాస్టిక్‌తో వచ్చే వ్యాధులను వివరిస్తూ మున్సిపల్ అధికారులు అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగాం అధికారి డీఈ సురేష్, మేనేజర్ శ్రీనివాస్, ఏఈ అరుణ్, మెప్మా శ్రీరాం గౌడ్, టౌన్ ప్లానింగ్ ప్రవీన్ కుమార్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, రాజేందర్ పాల్గొన్నారు.

●కోరుట్ల రూరల్: మండలంలో ఎంపీడీఓ రామకృష్ణ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. పలు గ్రామాలలో మొక్కలను నాటారు.

మొక్క నాటి పెళ్లి వేడుకలో పాల్గొన్న వధువు

●కోరుట్ల రూరల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవంను పురస్కరించుకొని కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామానికి చెందిన నవ వధువు మొక్కను నాటి పర్యావరణాన్ని కాపాడాలని ప్రతిజ్ఞ చేసింది. గురువారం కోరుట్ల పట్టణానికి చెందిన మణిదీప్‌తో ఎఖీన్‌పూర్ గ్రామానికి చెందిన మాలవికకు పెద్దలు పెళ్లి నిశ్చయించారు. పెండ్లికి వెళ్తున్న సమయంలో మాళవిక గ్రామ శివారులోని సాయిబాబా దేవాలయ ఆవరణలో మొక్కను నాటింది.

●మెట్‌పల్లిటౌన్: పర్యావరణన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలు అందరిపైన ఉందాని మెట్‌పల్లి సీనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం జూనియర్ సివిల్ జడ్జి నారం అరుణ్ కుమార్, జిల్లా అటవీ అధికారి యం. రవి ప్రసాద్ ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడుకోవడానికి పలు సూచనలు చేశారు. అటవీ అధికారులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కల్ని నాటారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు తొగిటి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్ ఉన్నారు.

●ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని మున్సిపల్ కమిషనర్ టి.మోహన్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని చెరువు కట్టలపై మొక్కలు నాటారు. ప్లాస్టిక్‌పై ర్యాలీ నిర్వహించి ప్రజలకు మొక్కల పెంపకం వల్ల కలిగే లాభాలను వివరించారు. జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, సిబ్బంది ముజీబ్, తదితరులు పాల్గొన్నారు.

●పర్యావరణన్ని కాపాడటానికి పట్టణానికి చెందిన అల్లాడి ప్రభాకర్ చేస్తున్న సేవలు అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ టి. మోహన్ అన్నారు. పట్టణానికి చెందిన అల్లాడి ప్రభాకర్ మొక్కలను కాటన్ బట్టలలో వివిధ రకాల మొక్కలను పెంచి వాటిని కమిషనర్ టి.మోహన్‌కు, సిబ్బందికి అందజేశారు. ప్రభాకర్ అందించిన మొక్కలను నాటారు.

●మెట్‌పల్లి రూరల్: పర్యావరణం పరిరక్షనతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పంచాయతీ కార్యదర్శి నిజాముద్దీన్ అన్నారు. మండలంలోని ఆత్మనగర్ గ్రామంలోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి నీరు పోశారు.

●సారంగాపూర్: అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సారంగాపూర్ మండలంలోని అర్పపల్లి, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో ఎంపీడీవో చౌడారపు గంగాధర్ , సిబ్బంది మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ సన్ను, పంచాయితీ కార్యదర్శి సర్వ శ్రేష్ట, ఫీల్డ్ అసిస్టెంట్ రవి, ఉపాధి హమీ కూలీలు పాల్గొన్నారు.

●ధర్మపురి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని ధర్మపురి పట్టణంలో, మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ ధర్మపురి మండల అధ్యక్షులు కుమ్మరి తిరుపతి, పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, దమ్మన్నపేట బూత్ అధ్యక్షులు ఒగ్గేటి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

●రాయికల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాయికల్ పట్టణంలో గురువారం రాయికల్ రేంజ్ అటవీ అధికారులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చింతలూరు గ్రామంలో అటవీ శాఖ అధికారులు గ్రామస్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రాయికల్ రేంజ్ ఆఫీసర్ భూమేష్, చింతలూరు సెక్షన్ ఆఫీసర్ మల్లన్న, బీట్ అధికారులు పాల్గొన్నారు.

●రాయికల్ పట్టణంలోని పెద్ద చెరువు కట్టపై మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వెంకటి, మెప్మా డీఎంసీ సునీత పాల్గొన్నారు.

●గొల్లపల్లి: గొల్లపల్లి మండల కేంద్రంలో ఎంపీడీవో రాంరెడ్డి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీవో సురేష్ రెడ్డి, సూపరిండెంట్ రవీందర్ రావు పాల్గొన్నారు.

●కొడిమ్యాల: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు సిబ్బంది తడిపొడి చెత్తపై అవగాహన కల్పించారు.

●మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం అర్బన్ పార్క్ పరిసరాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అటవి అధికారులు మొయి నుద్దీన్, మౌనిఖ, ప్రవీన్‌కుమార్ పాల్గొన్నారు.

బల్దియా జాగా కబ్జా

(5వ పేజీ తరువాయి)

కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించాలనే డిమాండ్లు బలంగా వినిపిస్తున్నాయి. ఈ విధానం అవలంబించడం ద్వారా ఆయా ప్రభుత్వ శాఖలకు భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉందని, కబ్జాలకు గురి కాకుండా ఉంటాయని జగిత్యాల వాసులు కోరుతున్నారు. మున్సిపల్ ఆధ్వర్యంలో కబ్జా స్థలాల్లో కమర్షియల్ కంప్లెక్స్ నిర్మించి, టెండర్ ద్వారా కేటాయింపు జరిపితే మున్సిపల్‌కు ఆదాయం పెరగడంతో పాటుగా, స్థలాలు మున్సిపల్ ఆధీనంలోకి వచ్చే అవకాశం ఉంది. ఆ దిశగా అధికారులు చొరవ చూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఆక్రమణలు మా దృష్టికి రాలేదు

-స్పందన, మున్సిపల్ కమిషనర్, జగిత్యాల

పట్టణంలోని గొల్లపల్లి రోడ్డు వైపు, బస్టాండు సమీపంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వ్యవహారం మా దృష్టికి రాలేదు. కొన్ని సంవత్సరాలుగా గొల్లపల్లి రోడ్డు, బస్టాండు సమీపంలో వందలాది మంది ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి పర్మనెంట్ దుకాణాలు నిర్మించుకున్న వ్యవహారంపై పరిశీలన జరిపి చర్యలు తీసుకుంటాం.

కొండగట్టులో విజిలెన్స్ అధికారుల తనిఖీలు



కొండగట్టులో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

మల్యాల, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలోని పలు విభాగాలను విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ప్రశాంత్‌రావు ఆధ్వర్యంలో అధికారులు గురువారం తనిఖీలు చేశారు. లడ్డు ప్రసాదాల తయారీలో నాణ్యత, తూకం పరిశీలించారు. ఆలయంలో దొంగలు ఎత్తుకెళ్లిన బంగారు, వెండి ఆభరణాల వివరాలు, 2023-24కు సంబంధించి దేవస్థానం ఆదాయ, వ్యయ రికార్డులు అడుగగా ఈవో అందుబాటులో లేరని దేవస్థానం అధికారులు తెలిపారు. దీంతో విజిలెన్స్ అధికారులు ఈవో శ్రీకాంత్‌రావుతో ఫోన్‌లో మాట్లాడారు. రెండు రోజుల్లో తాను వచ్చాక రికార్డులు అందిస్తామని అన్నట్లు తెలిసింది.

ఘనంగా పోచమ్మ బోనాలు

కోరుట్ల రూరల్ జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పైడిమడుగు గ్రామంలో గురువారం పోచమ్మ బోనాల జాతర గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పోచమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపనలో భాగంగా మహిళలు పోచమ్మకు బోనాలను సమర్పించారు. మహిళలు బోనాలతో గ్రామ పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో పోతరాజుల నృత్యాలు అకట్టుకున్నాయి. డప్పు చప్పుళ్ల మధ్య బోనాలను మహిళలు పోచమ్మకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పంటలు బాగా పండాలని ప్రజల ఆయురారోగ్యాలతో ఉండాలని పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

రాయికల్ : రాయికల్ పట్టణంలోని శివాజీ రైతు యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం బోనాలు తీశారు. ఈ సందర్భంగా మహిళలు పుర వీధుల గుండా బోనాలతో తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో శివాజీ రైతు యువజన సంఘం అధ్యక్షుడు కురుమ సుదర్శన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కురుమ నారాయణరెడ్డి, కోశాధికారి పటేల్ గోపాల్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు దమ్మ మోహన్‌రెడ్డి, కుంబాల సంతోష్ రెడ్డి, పడిగెల కిషోర్ రెడ్డి, పటేల్ నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాసవి మాత విగ్రహ ప్రతిష్ఠాపన

కోరుట్ల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవి మాత దేవాలయంలో మాత విగ్రహ పునఃప్రతిష్ఠాపన హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి వైదికంలో గురువారం ఘనంగా సాగింది. దేవాలయ రాజగోపురం కుంభాషేకం విద్యారణ్య భారతి స్వామి వారు నిర్వహించారు. విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం వేదపండితులు పాలెపు జయరాం శర్మ, రామకృష్ణ శర్మ, బరద్వాజ్ శర్మ, వినయ్ శర్మ, కపిల్ శర్మ మంత్రోచ్ఛరణ మధ్య సాగింది. ఈ సందర్భంగా దేవాలయంలో పూర్ణాహుతి నిర్వహించారు. మహిళలు విష్ణు, లలిత శాస్త్ర నామ పారయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైశ్య, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక ధరూర్ క్యాంప్ రామాలయంలో సమీపంలో వెలిసిన పెద్దమ్మతల్లికి గురువారం భక్తులు పూజలు నిర్వహించారు. బీజేపీ సీనియర్, రాష్ట్ర నాయకులు ముదుగంటి రవీందర్‌రెడ్డి గురువారం దర్శించుకున్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకుడు సబ్బని మారుతి సోదరి విజయ మరణించగా కుటుంబసభ్యులను పరామర్శించారు. వొడ్నాల భూమేష్ రోడ్డు ప్రమాదంలో, మాజీ జడ్పీ వైస్ చైర్మెన్ హరిచరణ్‌రావు తండ్రి సురేందర్‌రావు మరణించగా, మృతుల కుటుంబాలను పరామర్శించారు.

రైతు గుర్తింపు కార్డుల నమోదు

జగిత్యాలరూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం మోరపల్లిలో రైతు గుర్తింపు కార్డుల నమోదు ప్రక్రియ గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, ఏఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే భూభారతి

●అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత ● జిల్లాలో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

జగిత్యాలరూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికే భూభారతి నిర్వహిస్తున్నట్లు జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ బీ. ఎస్ లత అన్నారు. గురువారం జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సును అడిషనల్ కలెక్టర్ లత సందర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ ,గిర్దావర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

●ధర్మపురి: ధర్మపురి మండలంలోని నాగారం గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మపురి ఇంచార్జ్, బుగ్గారం మండల తహసీల్దార్ ఎంఏ మాజీద్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ధర్మపురి ఏఎంసీ చైర్‌పర్సన్ లావణ్య, వైస్ చైర్మన్ నర్సింహులు, ఆర్‌ఐలు శ్రీనివాస్‌యాదవ్, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

●మెట్‌పల్లి రూరల్ : గ్రామాలలో భూ సమస్యలు ఉన్న వారు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో దరఖాస్తులు చేసుకోవాలని మెట్‌పల్లి తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. వెల్లుల్ల, చౌలమద్ది గ్రామాల్లో తహసీల్దార్‌తో పాటు డీటీ అబ్దుల్ ఖాదిర్, ఆర్‌ఐలు కాంతయ్య, ఉమేష్‌లు సద్సులు నిర్వహించారు.

●కొడిమ్యాల: మండలంలోని సూరంపేట గ్రామంలో భూ భారతి గ్రామ సభను తహసీల్దార్ ఎం. కిరణ్‌కుమార్ నిర్వహించారు. 57 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

●పెగడపల్లి: భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని పెగడపల్లి మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని లింగాపూర్, ల్యాగలమర్రి గ్రామాలలో రెవెన్యూ అధికారులు భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. సదస్సులలో తహసీల్దార్ బి.రవీందర్, నాయబ్ తహసీల్దార్ లాస్యశ్రీ, గిర్దావర్‌లు పాల్గొన్నారు.

●కథలాపూర్: నూతనంగా ప్రభుత్వం అమలులోకి తెచ్చిన భూభారతి చట్టం వల్ల గ్రామాల్లో భూసమస్యలు పరిష్కారం కావడానికి ఆస్కారం ఏర్పడిందని కోరుట్ల ఆర్‌డీఓ జివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దూలూరులో జరిగిన భూభారతి చట్టం గ్రామసభకు హాజరై మాట్లాడారు. తహసీల్దార్ వినోద్, ఆర్‌ఐ నగేశ్, జూనియర్ అసిస్టెంట్ మురళి, సిబ్బంది, రైతులు ఉన్నారు.

●రాయికల్: మండలంలోని ఆలూరు, వస్తాపూర్ గ్రామాల్లో గురువారం భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ నాగార్జున ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

●బీర్‌పూర్: నర్సింహులపల్లి, కోమన్‌పెల్లి గ్రామాలలో తహసీల్దార్ సుజాత, డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామ సభలను నిర్వహించారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- కాంగ్రెస్ నియోజవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. గురువారం మండలంలోని అయిలాపూర్ లో మండలంలోని 9 గ్రామాలకు చెందిన 414 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పొసీడింగ్ పత్రాలను స్థానిక నాయకులతో కలిసి అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. పది సంవత్సరాల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమని, 18నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి పనులను చేపట్టిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ అంజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు ప్రియాంక - సురేష్, నాయకులు గంగాధర్ గౌడ్, సురేష్ గౌడ్, పుల్లా రెడ్డి, సత్యనారాయణ గౌడ్, మహిపాల్ రెడ్డి, కొంత రాజం, పడాల లచ్చయ్య, లింబ్రాద్రి, తిరుమల గంగాధర్‌లతో పాలు పలువురు పాల్గొన్నారు.

● మల్లాపూర్: పేదలకు స్వంత ఇల్లు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని కోరుట్ల నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. గురువారం మండలంలోని రాఘవపేటలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను కమిటీ సభ్యులతో కలిసి అందజేశారు. రేషన్ కార్డులు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ మాజీ జడ్పీటీసీ, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జలపతిరెడ్డి, నాయకులు నల్ల రాజన్న, గడ్డం మైపాల్‌రెడ్డి, బాపు రెడ్డి, నర్సయ్య, రమేష్, సురేష్, రఫి, సురేందర్, మాజీ సర్పంచులు మార్కెట్ కమిటీ పాలక వర్గం, ముత్యంపేట సొసైటీ చైర్మన్ నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే భూ భారతి

- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తూ దరఖాస్తులు స్వీకరిస్తుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. గురువారం మండలంలోని వెంకటాపూర్, గుమ్లాపూర్ గ్రామాలలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులను జువ్వాడి కృష్ణారావు స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. తహసీల్దార్ కృష్ణచైతన్య ఆధ్వర్యంలో ఆర్‌ఐలు అమర్ సయ్యద్, రాజేందర్‌రావులు భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తోట నారాయణ కాంగ్రెస్ నాయకులు బర్కం నర్సయ్య, కొంత రాజం, గంగాధర్ పాల్గొన్నారు.

● మెట్‌పల్లిటౌన్ : పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. గురువారం పట్టణంలోని 16,17,18,19, 24,26 వార్డులకు చెందిన పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొమిరెడ్డి విజయ్ అజాద్, పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెగడపల్లిలో బీరప్ప జాతర ఉత్సవాలు

పెగడపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండల కేంద్రంలో గురువారం బీరప్ప జాతర ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గొల్ల, కురుమల ఆరాధ్య దైవమైన బీరప్ప జాతర ఉత్సవాల్లో బాగంగా గురువారం కురుమ సంఘం ఆధ్వర్యంలో మంద పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఇంటికో బోనంతో డప్పు చప్పుళ్లతో ర్యాలీగా పోచమ్మ ఆలయానికి తరలివెళ్లి పోచమ్మతల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. 6న క్షీరాభిషేకం, 7న గంగాభోనం, 8న సుంకు పట్టుట, 9న లగ్గం పట్నం, 10న జోగు తిరుగుట, బోనాలు, 11న నాగవెల్లి పట్నం, 12న ఎట్టి ముల్లెలు, 13న గారడి వేశంతో ఉత్సవాలు ముగుస్తాయని కురుమ సంఘం నాయకులు ఒరుగల శ్రీనివాస్, రాజేశం తదితరులు తెలిపారు.

గోవధను అరికట్టాలి

-వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు పద్మాకర్

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో గోవధ(గోహత్యను) అరికట్టాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బోయిని పద్మాకర్ డిమాండ్ చేశారు. గోహత్యను అరికట్టాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయంలో కార్యాలయ ఏవోను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సరిహద్దులో ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటు చేయాలని, గోవులను అక్రమ రవాణా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

అలాగే రాష్ట్రంలో చట్టవిరుద్ధంగా కొనసాగుతున్న గోవధ శాలలను తక్షణం మూసివేసేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్, రాష్ట్ర నాయకులు ముదుగంటి రవీందర్‌రెడ్డి, భారత్ సురక్షా సమితి బాధ్యులు ఏసీఎస్ రాజు వీహెచ్‌పీ బాధ్యులు గాజోజు సంతోష్‌కుమార్, నరేష్, జిట్టవేణి అరుణ్‌కుమార్, మామిడాల రాములు, లింగంపేట శ్రీను, భజరంగ్‌దళ్ కన్వీనర్ పాదం మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల ఆడిటోరియంలో గ్రామీణాభివృద్ధి శాఖ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో రఘువరన్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పాల్గొన్నారు.


నవోదయలో వసతులు కల్పించాలి

కోరుట్ల: పట్టణంలో తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్న జవహర్ నవోదయ విద్యాలయంలో పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలని కలెక్టర్ సత్యప్రసాద్ విద్యా, రెవెన్యూ శాఖ అధికారులకు సూచించారు. గురువారం పట్టణంలోని ఇంటిగ్రేటెడ్, ఎస్సీ హాస్టల్ భవనాలను కలెక్టర్ సత్యప్రసాద్ సందర్శించారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి జీవాకర్ రెడ్డి, డీఈవో రాం, తహసీల్దార్ కృష్ణవంశీ పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

సారంగాపూర్: మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ బి సత్యప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. అనారోగ్యంతో ఆస్పత్రికి వచ్చే రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ జైపాల్‌రెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ రాధ, ఫార్మసిస్ట్ శ్రీనివాస్, జలజ ఉన్నారు.

చొప్పదండి ఎమ్మెల్యే సత్యం జన్మదిన వేడుకలు



కొడిమ్యాలలో కేక్ కట్ చేస్తున్న సింగిల్ విండో చైర్మన్

కొడిమ్యాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంగడి బజారులో చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపెల్లి సత్యం జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని నాచుపల్లి గ్రామంలో కొడిమ్యాల సింగిల్ విండో చైర్మన్ మెన్నేని రాజనర్సింగరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం కొండగట్టు అంజేయ స్వామి సన్నిదిలో ఎమ్మెల్యే పేరున ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. తిప్పయ్యపల్లిలో మాజీ సర్పంచు మ్యాకల లతమల్లేశం యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే సత్యం జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, పూడూర్ సింగిల్ విండో చైర్మన్ బండ రవీందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు, కేంద్ర సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు ముమ్మాడి స్వామి, ప్రభాకర్‌రెడ్డి, చంద్రమొహన్‌రెడ్డి, నాగభూష ణ్‌రెడ్డి, నాయకులు చంద్రమొహన్‌రెడ్డి, గంగయ్య, ముత్యంరెడ్డి, ప్రవీణ్, తిర్మలేష్, అజయ్‌గౌడ్, శంకర్ పాల్గొన్నారు.

●మల్యాల: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జన్మదిన వేడుకలను మండలంలోని అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకోగా మల్యాల మండల కేంద్రంలో బైక్ ర్యాలీ చేశారు. కొండగట్టుకు చెందని పొన్నం సాయిగౌడ్ అన్నదానం ఏర్పాటు చేశారు. ముత్యంపేట, సర్వాపూర్, ఓబులాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు కేక్ కట్ చేశారు. మల్యాల సింగిల్‌విండో చైర్మన్ ఎం రాంలింగారెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ బత్తిని మల్లీశ్వరీశ్రీనివాస్‌గౌడ్, దొంగ ఆనందరెడ్డి, ముత్యం శంకర్, శనిగారపు తిరుపతి పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక ప్రయోజనం

కోరుట్ల రూరల్ జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పంట మార్పిడితో రైతులు అధిక లాభాలు పొందవచ్చని జగిత్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేతలు డాక్టర్ రజనీదేవి, డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని జోగినిపల్లి, సంగెం గ్రామాల్లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి నాగమణి ఆధ్వర్యంలో గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు పంట మార్పిడితో పాటు పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓలు రాఘవేంద్ర, నరేష్, రైతులు పాల్గొన్నారు.

నరసింహుని సన్నిధిలో కోరుట్ల ఆర్‌డీవో పూజలు

ధర్మపురి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని కోరుట్ల ఆర్‌డీవో జివాకర్‌రెడ్డి కుటుంబసమేతంగా గురువారం సందర్శించారు. ఆలయం వద్ద ఆయనకు వేదపండితులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ముఖ్య అర్చకులు సీహెచ్ రమణాచార్యా, అర్చకులు ఆయనను ఆశీర్వదించారు. ఆలయ ధర్మకర్త రాపర్తి సాయికుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ వారికి స్వామి శేషవస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహుకరించారు.

మహాలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠాపన

జగిత్యాలరూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతర్గాం గ్రామంలో మహలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో నిర్వ హించిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ముఖ్య అథితులుగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, మాజీ మంత్రులు సుద్దాల దేవయ్య, రాజేశంగౌడ్ పాల్గొని ఆలయంలో ప్ర త్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

భీమారం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): భీమారం మండలం ఒడ్యాడ్‌లో రైతు లింగంపల్లి గంగనర్సయ్యకు చెందిన గేదె గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. రైతు తన పొలంలో మేతకు గేదెను వదలగా అది విద్యుత్ స్తంభానికి తాకి మృతి చెందింది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

రాయికల్ తహసీల్దార్‌గా నాగార్జున

రాయికల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండల తహసీల్దార్‌గా ఎస్ నాగార్జున గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ ఖయ్యూం సౌదీ వెళ్లేందుకు స్టేట్ హజ్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులు కాగా, నాయబ్ తహసీల్దార్ గణేష్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అతను ఏసీబీకి పట్టుబడ్డాడు. ఎన్నికల బదిలీల్లో భాగంగా నిజామాబాద్ జిల్లాకు వెళ్లిన నాగార్జున ఇటీవల తిరిగి జిల్లాకు రాగా ధర్మపురి తహసీల్దార్‌గా నియమించారు. విధుల్లో చేరక ముందే బదిలీని నిలిపివేసి రాయికల్ తహసీల్దార్‌గా నియమించారు.

కుడి కాలువ మరమ్మతులు పూర్తి

కథలాపూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూషణరావుపేట శివారులో నక్కల ఒర్రె వద్ద గత ఏడాది కురిసిన వర్షాలకు గండి పడగా మరమ్మతులు పూర్తిచేశారు. ఎక్స్‌కావేటర్, ట్రాక్టర్లతో కాంట్రాక్టర్ మొరం వేసి గండి పూడ్చే పనులను ముమ్మరంగా చేపట్టారు. ఈ గండి కారణంగా చివరి ఆయకట్టు రైతులకు నీరందని పరిస్థితి తలెత్తింది. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఆర్మూర్ డివిజన్ ఇరిగేషన్ అధికారులు కాంట్రాక్టర్‌తో గండిని పూడ్చివేయించారు.